అభినందనలు

శేరిలింగంపల్లి: కజకిస్తాన్‌లో నిర్వహించిన ప్రపంచ ఓపెన్ ఏషియన్ పవర్ లిఫ్టింగ్ అండర్‌-19 విభాగంలో బంగారు పతకం సాధించిన సాయి కౌశిక్‌ను కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్ గౌడ్ గురువారం అభినందించారు. పాపిరెడ్డి కాలనీకి చెందిన సాయి కౌశిక్ దేశం తరపున బంగారు పతకం సాధించి ఆదర్శంగా నిలిచారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు.

గోల్కొండ ఆస్పత్రిలో వరల్డ్ కిడ్నీ డే



గోల్కొండ: శరీరంలో కిడ్నీలు అత్యంత ప్రధానమైనవని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. గురువారం ఆస్పత్రిలో వరల్డ్ కిడ్నీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తోటి వైద్యులు, సిబ్బందితో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన కిడ్నీల ప్రాధాన్యం వాటి పనితీరును వివరించారు. కిడ్నీలు శరీరంలో గుండె తర్వాత అత్యంత ప్రధానమైనదని అన్నారు. కిడ్నీ పాడైతే శరీరంలోని ఇతర అంగాలు కూడా క్రమేపి దెబ్బతింటాయన్నారు. కిడ్నీల పరిరక్షణ కోసం తరచూ వైద్యులను కలుస్తుండాలన్నారు. వీపు కిందిభాగంలో నొప్పి, మూత్ర సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీ నివేదిక అందజేత

నాంపల్లి: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ నేతృత్వంలో ఉద్యోగుల ప్రతినిధి బృందం గురువారం బీఆర్‌కే భవన్‌లో నూతన పీఆర్సీ కమిషనర్ ఎన్.శివశంకర్‌ను కలిసి పీఆర్సీ నివేదికను సమర్పించారు. వేతన సవరణ, ఫిట్‌మెంట్, సీపీఎస్ విధానం రద్దు, ఇంటిఅద్దె, రిటైర్డ్‌మెంట్ గ్రాట్యుటీ పెంపు, అడ్వాన్సులు, ఓడీ వంటి అంశాలతో కూడిన ప్రతిపాదన నివేదికను అందజేశారు. నిర్ణీత గడువులోగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని కోరారు. సంఘం నేతలు ఖాదర్ బిన్ హసన్, ధన్‌రాజ్, శ్రీనివాస్‌లతో పాటు 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు సన్నద్ధం!

పూర్తయిన సిలబస్
- కొనసాగుతున్న రివిజన్
- ప్రత్యేక తరగతులతో మరింత పట్టు
- ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఎగ్జామ్స్
- హాజరు కానున్న 9099 మంది విద్యార్థులు



పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

మణికొండ: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 18వ తేదీన ఎగ్జామ్స్ ప్రారంభం కానుండగా ఏప్రిల్ 2వ తేదీన ముగియనున్నాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇప్పటికే సిలబస్‌ను పూర్తి చేసి విద్యార్థులకు రివిజన్, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారు మరింత పట్టు సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల పరిస్థితిని అంచనా వేసి వారికి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తూ స్టూడెంట్లలో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు.

మండలాల వారీగా విద్యార్థులు..

రాజేంద్రనగర్ నియోజకవర్గపరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో మొత్తం 170 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ యేడు 9099 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు. గండిపేట మండల పరిధిలో 45 పాఠశాలల్లో బాలురు 1307 మంది, బాలికలు 1371 మొత్తం 2678 మంది ఎగ్జామ్ రాయనున్నారు. రాజేంద్రనగర్ మండల పరిధిలో 84 పాఠశాలల్లో బాలురు 2408 మంది, బాలికలు 2311 , శంషాబాద్ మండల పరిధిలోని 41 పాఠశాలల్లో బాలురు 784 మంది, బాలికలు 958 మొత్తం 1702 మంది పరీక్షలు రాయనున్నారు.

విద్యార్థులకు నిపుణుల సూచనలు:

విద్యార్థులు ఏడాది పాటు చదివింది గుర్తుంచుకుని క్వశ్చన్ పేపర్‌లో వచ్చే ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయాలి. మొదటిసారి బోర్డు ఎగ్జామ్ అనగానే కొందరు విద్యార్థులు కంగారులో, భయం, మానసిక ఒత్తిడితో సకాలంలో సమాధానాలు గుర్తుకు రాక పరీక్షలను సరిగా రాయలేకపోతారు. అలాంటి వారు ప్రతిరోజు రాత్రి 10 గంటల వరకు చదువుకుని, మళ్లీ ఉదయం 4.30 గంటలకే నిద్ర లేచి 6.30 గంటల వరకు మరోసారి చదువుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం 9 గంటల్లోగా పరీక్షా కేంద్రానికి చేరుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. జవాబు పత్రం ఇవ్వగానే మార్జిన్లు కొట్టుకోవడం, ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివి బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాయాలి.

తప్పులు, కొట్టి వేతలు లేకుండా చూసుకోవడ, జవాబు అవ్వగానే గీత కొట్టడం, ప్రశ్న నంబర్, సెక్షన్ రాయాలి. బిట్ పేపర్ ఇవ్వగానే దారంతో కట్టడం, తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు ముందుగా, ఆలోచించి రాసేవి తర్వాత రాయాలి. చివరి 15 నిమిషాలు పేపర్‌ను పూర్తిగా పరిశీలించి, సంతృప్తిగా పేపర్ ఇచ్చి బయటకు రావాలి.



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

పరీక్షల షెడ్యూల్..

పదో తరగతి పరీక్షలు ఈ నెల 18వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్‌తో ప్రారంభం కానున్నాయి. 19వ తేదీన సెకండ్ లాంగ్వేజ్, 21న మూడో లాంగ్వేజ్, 23న మ్యాథ్స్, 26న సైన్స్ పార్ట్-1, 28న సైన్స్ పార్ట్-2, 30న సోషల్, ఏప్రిల్ 1న సంస్కృతం పేపర్-1, అరబిక్, ఒకేషనల్ కోర్సు, 2వ తేదీన సంస్కృతం అరబిక్ పేపర్-2తో ముగియనున్నాయి. పరీక్షలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరగనున్నాయి. ఈ యేడ ప్రభుత్వం విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను ప్రకటించింది.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తా..



ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేశారు. దీంతో రెండు నెలల పాటు రివిజన్ చేసుకునే అవకాశం వచ్చింది. ఆయా సబ్జెక్టుల్లో ఏమైనా సందేహాలు ఉంటే డిజిటల్ తరగతి గదుల్లో ఉపాధ్యాయులు వీడియో రూపంలో చూపించి నివృత్తి చేశారు. దాంతో సబ్జెక్టులపై పూర్తి స్థాయిలో పట్టు వచ్చింది. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి గ్రేడ్ సాధిస్తాను.

–కుశ్వంత్, పదో తరగతి విద్యార్థి

మంచి గ్రేడ్ సాధిస్తా..



అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు డిజిటల్ రూపంలో పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించారు. దీంతో సిలబస్‌పై పూర్తిస్థాయిలో పట్టు సాధించినం. ప్రతి సబ్జెక్టులో ఉత్తమ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. ఈసారి అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ మార్కులు సాధించి ఓవరాల్‌గా మంచి గ్రేడ్‌ను సాధిస్తా.

–భార్గవి, పదో తరగతి, విద్యార్థిని

కార్యాచరణతో బోధన..



ప్రస్తుత విద్యాసంవత్సరం సకాలంలో ప్రారంభం కావడంతో సిలబస్‌ను సకాలంలో కార్యాచరణతో పూర్తి చేశాం. అనంతరం రెండు నెలల పాటు ప్రత్యేక తరగతు లు, డిజిటల్ తరగతుల రూ పంలో రివిజన్ నిర్వహించాం. ప్రతి సబ్జెక్టు ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా బోధించినం. చదువుతో పాటు పరీక్షలంటే భయం లేకుండా వారిలో ఆత్మవిశ్వాసం నింపినం.మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధిస్తారని నమ్మకం ఉంది.

–నిరంజన్, హెచ్‌ఎం, మణికొండ ప్రభుత్వోన్నత పాఠశాల

ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం



ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గండిపేట మండలంలో 10, శంషాబాద్ మండలంలో 8, రాజేంద్రనగర్ మండలంలో 19 కేంద్రాలు ఏర్పాటు చేసినం. ఇందులో మొత్తం 9099 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్, నియోజకవర్గంలో 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తిరుగుతుంటారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

–రాంరెడ్డి, రాజేంద్రనగర్ మండల విద్యాధికారి

వాటర్ ట్యాంకర్ ప్రారంభం



నీటి సరఫరాను ప్రారంభిస్తున్న జలమండలి జీఎం చంద్రశేఖర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జలమండలి వాటర్ ఫిల్లర్ వద్ద సర్కిల్ జలమండలి జీఎం చంద్రశేఖర్ స్టీల్ వాటర్ ట్యాంకర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా తాగునీటి ట్యాంకర్‌ను బుక్ చేసుకున్న వారికి ఆర్డర్ ప్రకారం నీటిని సరఫరా చేస్తామన్నారు. స్టీల్ ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా మరింత పారదర్శకంగా ఉంటుందన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలోని ప్రజలు తమ క్యాన్ నంబర్ ద్వారా తాగునీటి ట్యాంకర్లను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే ఆయా వాటర్ ఫిల్లర్ బెడ్ల నుంచి నీటి సరఫరాను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ రామ్ నరసింహా, సాయి మల్లిక్, కాంట్రాక్టర్ మజ్జిగ నరేశ్ యాదవ్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను పరిశీలించిన కార్పొరేటర్

శేరిలింగంపల్లి: లింగంపల్లిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపల్లి విలేజ్‌లో 90శాతం రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. అనంతరం బస్తీ దవాఖానాలోకి వెళ్లి అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న సేవల గురించి వారితో మాట్లాడారు. అనంతరం లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ అధ్యక్షులు రవియాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతిపంపును నాగేందర్‌యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంచందర్‌యాదవ్, అశోక్, అజీమ్, సుభాష్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవి, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘పోతన భాగవతం-అలంకార శిల్పం’ ఆవిష్కరణ



రాయదుర్గం: అలంకారశాస్త్రంపై పరిమితంగా పరిశోధనలు జరుగుతున్నాయని హెచ్‌సీయూ ఆచార్య పిల్లలమర్రి రాములు పేర్కొన్నారు. ఈ కాలంలో పోతన రాసిన మహా భాగవతంలో అలంకార శిల్పం గురించి పరిశోధన చేయడం ఎంతో విశేషంగా ఆయన అభివర్ణించారు. గురువారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయులోని తెలుగుశాఖ కార్యాలయంలో పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గొట్టె శ్రీనివాస్‌రావు తన పరిశోధనా గ్రంథం ‘పోతన భాగవతం-అలంకారశిల్పం’ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పిల్లల మర్రి రాములు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు తమ పరిశోధనా అంశం ఎంపికలో పలు జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో వాటి ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహా కావ్యమైన ఆంధ్ర మహా భాగవతంపై పరిశోధన చేయడం ఒక విశేషమన్నారు. అయితే దానిలోని అలంకారాలపై సమగ్రంగా అధ్యయనం చేయడం అత్యంత ప్రశంసనీయమన్నారు. ఆచార్య పిల్లలమర్రి రాములు వద్ద ఇప్పటి వరకు 30 మంది పీహెచ్‌డీలు, 40 మంది ఎంఫిల్ పరిశోధనలు జరిగినప్పటికీ ఇదే ప్రచురితమైన తొలి పీహెచ్‌డీ గ్రంథం కావడం మరో విశేషమన్నారు. గ్రంథ రచయిత డాక్టర్ గొట్టె శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను చదువుకొని పరిశోధన చేసిన తెలుగుశాఖలోనే తన గ్రంథం ఆవిష్కరణ కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు గోనానాయక్, పమ్మి పవనకుమార్, డి విజయలక్ష్మీ, పి వారిజారాణి, త్రివేణి వంగరి, బాణాల భుజంగారెడ్డి, డాక్టర్ డి విజయకుమారి, డాక్టర్ లచ్చయ్య, డాక్టర్ భగ్గు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ఐ ముద్రతో వినియోగదారులకు భరోసా



వర్ధమాన్ కళాశాలలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: ఐఎస్ఐ ముద్ర వినియోగదారులకు భరోసా ఇస్తుందని శంషాబాద్ ఏసీపీ కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ×బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌కె ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మానక్ ఉత్సవ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్తువులు కొనే ముందు తప్పనిసరిగా ఐఎస్ఐ ముద్రను పరిశీలించాలన్నారు. హాల్ మార్క్ ధ్రువీకరణ పొందిన బంగారు ఆభరణాలను మాత్రమే ఖరీదు చేయాలని సూచించారు. అలాగే బీఐఎస్ కేర్ యాప్ వినియోగదారులకు ఆయుధం లాంటిదన్నారు. వివిధ రంగాల్లో భారతీయ ప్రమాణాలు, పాటించే విధానం, ఉత్పత్తుల వారి ప్రమాణాలపై విద్యార్థులకు బీఐఎస్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. భారతీయ ప్రమాణాలపై నిర్వహించిన చర్చాగోష్టిలో విజేతలకు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో బీఐఎస్ శాస్త్రవేత్త ఏఎన్ఎస్పీ శాస్త్రి, జాయింట్ డైరెక్టర్లు సుజాత, రాకేశ్, ఎస్పీఓ అభిసాయి, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై చెత్త వేయద్దు



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్

రాజేంద్రనగర్: రోడ్లపై చెత్త వేయడం తగదని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ అన్నారు. రాజేంద్రనగర్ శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ‘స్వచ్ఛత వైపు ఒక్క అడుగు’ అంటూ ఏర్పాటు చేసిన కార్యక్రమ ర్యాలీని గురువారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు పారిశుధ్య కార్మికులు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలు, కాలనీలు, ఓపెన్ పాయింట్లు, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేస్తున్నారన్నారు. ఆటోరిక్షా కార్మికులు కూడా ఇంటింటికీ తిరుగుతూ చెత్తను సేకరిస్తున్నారని తెలిపారు. కానీ కొందరు తమ ఇండ్లలోని చెత్తాచెదారాన్ని బహిరంగ ప్రదేశాల్లో పాడేస్తూ అపరిశుభ్రత నెలకొల్పుతున్నారని పేర్కొన్నారు. ఇకముందు అలాంటివారిని గుర్తించి పెనాల్టీ వేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు తమ కేంద్రంలోని చెత్తాచెదారాన్ని తమ షాపు వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి

చార్మినార్: గెలుపోటములు సహజమని.. అంతమాత్రానా తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహం చెందాల్సిన అవసరం లేదని బీఎస్పీ రాజ్యసభ ఎంపీ రామ్‌జీ గౌతం తమకు చెప్పారని బీఎస్పీ నగర అధ్యక్షులు మూల రామ్‌చరణ్‌దాస్ తెలిపారు. గురువారం బీఎస్పీ కార్యాలయానికి వచ్చిన రామ్‌జీ గౌతంను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. నగరంలో బహుజన సమాజ్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరింత ఉత్సాహంగా పనిచేయాల్సిన అవసరం ఉందనే విషయాన్ని తమకు ఆయన వివరించారన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి చిరంజీవి, ఉపాధ్యక్షుడు బంగారి మానిక్‌రావు, రాకేష్ తదితరులున్నారు.

సర్కారు బడిలో సమస్యల తిష్ట..!

- అధ్వానంగా ఉడంగడ్డ ప్రభుత్వ పాఠశాల
- విద్యార్థులకు కనీస వసతులు కరువు
- పెచ్చులూడుతున్నా తరగతి గదుల స్లాబ్
- ఆవరణంతా చెత్తమయం
- ఇబ్బందుల్లో స్టూడెంట్స్, సిబ్బంది



ఉడంగడ్డ ప్రభుత్వ పాఠశాల

మైలార్‌దేవ్‌పల్లి: సర్కారు మారినా.. సర్కారు బడుల్లో సమస్యలు మాత్రం తప్పడం లేదు. కనీస వసతులు లేక విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఉడంగడ్డ ప్రాథమిక పాఠశాలలో పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి. మరుగుదొడ్లకు నీటి సరఫరా లేకపోవడంతో పాటు వాటిని శుభ్రం చేసే వారు లేక దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల నిర్మించి 24 ఏళ్లు కావస్తుండండంతో కొన్నిచోట్ల గోడలకు పగుళ్లు రాగా మరికొన్ని తరగతి గదుల్లోని స్లాబ్ పెచ్చులూడి పోతున్నది. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన వారే విద్యార్థులతో చెత్త బుట్టాలు ఎత్తిస్తున్నారు. ఇటీవలే సాక్షి ప్రతినిధి ఎదుటే ఓ విద్యార్థి చెత్తబుట్టను బయటకు తీసుకెళ్తూ కనిపించాడు. వీరితో ఎందుకు పని చేయిస్తున్నారని సదరు ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నిస్తే పాఠశాలలో స్వీపర్లు లేక విద్యార్థులే ఆ పనిని చేపడుతున్నారని బదులిచ్చారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది కూడా రావడం లేదని పేర్కొంటున్నారు. అదేవిధంగా రాత్రి సమయంలో పోకిరీలు పాఠశాలలోకి వచ్చి మద్యం తాగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడంతో కొన్ని వసతులు కల్పించామని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలో వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం



తోచిన సహాయం అందిస్తున్నాం..



విద్యార్థులు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని దోనర్ల ద్వారా కొన్ని వసతులు కల్పించినం. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో కనీస వసతులు కల్పిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

–పర్వకుమార స్వామి; నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షుడు

చలివేంద్రం ప్రారంభం



మణికొండ ఆర్‌కే సర్కిల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

మణికొండ: చలివేంద్రాలతో ఏర్పాటుతో ఎంతో మందికి మేలు కలుగుతుందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వీఆర్‌ఫర్‌యూ స్వచ్ఛంద సంస్థ వారు ఏర్పాటు చేసిన రెండు చలివేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటారని, అలాంటి వారికి ఉపశమనం కలిగించేలా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బాపూజీ, కార్యదర్శి డి.సీ తారాందాస్, సభ్యులు రొక్కం కుమార్, ప్రదీప్ రావు, సాంబశివరావు, నాగేంద్రరావు, మోహన్ రావు, శివరామకృష్ణ, ప్రభావతి, విజయలక్ష్మి, రాజిరెడ్డి, లక్ష్మణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లే టూరిజం బ్రాండ్ అంబాసిడర్లు

- ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలాజయదేవ్
- 200 మంది క్యాబ్ డ్రైవర్లకు ‘అతిథి దేవోభవ’ శిక్షణ

శంషాబాద్: ఏ నగరంలోనైనా ఆటో, క్యాబ్ డ్రైవర్లే పర్యాటక రంగానికి నిజమైన బ్రాండ్ అంబాసీడర్లని ఎఫ్‌టీసీసీఐ (ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ) అధ్యక్షుడు మీలా జయదేవ్ అన్నారు. ఎఫ్‌టీసీసీఐలోని టూరిజం విభాగం ఆధ్వర్యంలో జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఆడిటోరియంలో 200 మంది క్యాబ్ డ్రైవర్లకు ‘అతిథి దేవోభవ’ పేరిట గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులు ప్రధానంగా ఆధారపడేది డ్రైవర్లపైనే అని అన్నారు. అతిథులతో ప్రవర్తన, మర్యాద, హుందాతనం, భాషా పరిజ్ఞానం ఎంతో కీలకమన్నారు. ఈ సందర్భంగా ఐఐహెచ్‌ఎం ఆధ్వర్యంలో ప్రవర్తన, స్వీకరణ అంశాలను వివరించారు. అలాగే అపోలో ఆస్పత్రి బృందం ద్వారా సీపీఆర్ చికిత్స చేసే విధానాన్ని చేసి చూపించారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్ సింఘాల్, టూరిజం కమిటీ చైర్‌పర్సన్ రాఖీ కంకారియా, కో–చైర్మన్ డి. రామచంద్రం పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న క్యాబ్ డ్రైవర్లు

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

గోల్కొండ: మజ్లిస్ ఆధ్వర్యంలో తాను నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్వాన్, గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్ల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. డ్రైనేజీ సమస్య, తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు చేయగా.. సానుకూలంగా స్పందించిన ఆయన తాగునీటికి ఎలాంటి కొరత లేదని అధికారులు కూడా తాగునీటి సరఫరాపై కోతలు విధించడం లేదన్నారు. వేసవిలో నీటి కోతలు విధించొద్దని తాను జలమండలి అధికారులను కోరానన్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాలో లోప్రెషర్ సమస్య ఉందని, దీనిని కూడా పరిష్కరిస్తున్నామన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం జలమండలి ఆపరేషన్స్ డైరెక్టర్ విజయరావును కలిశారు. తాగునీటి సమస్య, పైపులైన్స్, కొత్త లైన్ల ఏర్పాటు తదితర వాటిపై చర్చించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సరఫరా అయ్యే తాగునీరు మాత్రం అంతే ఉంటుందన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి కొత్తగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. దీన్నివల్ల ప్రజల తాగునీటి అవసరాలు తీరే అవకాశం ఉంటుందన్నారు. లంగర్‌హౌజ్, కార్వాన్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం వేసిన పైపులు మార్చి కొత్త వాటిని వేయాల్సి ఉందన్నారు. పాతపైపులైన్లు పగిలి తాగునీరు రోడ్లపై వృధాగా పారుతుందన్నారు. నియోజకవర్గంలో రంజాన్ నెలలో తాగునీరు నిర్దేశించిన మోతాదులో అందించాలని ఆయన కోరారు. సాంకేతిక ఇబ్బందులు ఏర్పడితే వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.